క్లుప్తంగా

ఉచిత సంగీత శిక్షణ



సామర్లకోటలో సంగీత శిక్షణ అందిస్తున్న టీచర్ సూర్యావతి

సామర్లకోట: స్థానిక గ్రామ దేవత నూకాలమ్మ ఆలయంలో శ్రీశారదా సంగీత నిలయం ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత కర్ణాటక సంగీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు వేసవి సెలవులు కావడంతో శ్రీశారదా సంగీత నిలయం టీచర్ లోకారెడ్డి సూర్యావతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు సంగీత శిక్షణ అందిస్తున్నారు. ఈనెలాఖరు వరకు నిర్వహించే శిక్షణకు 30 మంది వస్తున్నారని నూకాలమ్మ ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు.

భూముల రక్షణకు కంచె



ఈటీసీ సరిహద్దులో కంచె ఏర్పాటుకు వేసిన సిమెంట్ స్తంభాలు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 99 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈటీసీ భూములలో 55 ఎకరాలు ఇళ్ల స్థలాలకు, ఐదు ఎకరాలు గోదాములకు సేకరించారు. దాంతో ఉన్న భూములను పరిరక్షించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. భూముల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయిలు ఈటీసీలోకి ప్రవేశిస్తున్నారు. దాంతో ఈటీసీ హద్దులలో ఇనుప తీగతో కంచె ఏర్పాటు చేయాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ నిర్ణయించారు. ఈ మేరకు నవదుర్గ ఆలయం వైపు ఉన్న భూముల హద్దులో సిమెంట్ స్తంభాలు వేసి ఇనుప తీగతో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు.

విధులపై అవగాహన



సామర్లకోట ఎంపీడీఓకు మొక్కను అందిస్తున్న కొత్తగా ఎంపికైన ఎంపీడీఓలు

సామర్లకోట: రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన ఎంపీడీఓలు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ అంశాలపై శిక్షణ పొందారు. ఆరు నెలల శిక్షణలో భాగంగా ఈ నెల ఒకటి తేదీ నుంచి స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 34 మంది ఎంపీడీఓలు శిక్షణ పొందుతున్నారు. స్థానిక ఎంపీడీఓ డి.శ్రీలలిత వారికి పలు విషయాలు వివరించారు. మండల పరిషత్తు కార్యాలయంలో రికార్డుల తయారీ, పరిశీలన, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, హక్కులు, బాధ్యతల వంటి అంశాలపై శ్రీలలిత వివరించారు.

ముగిసిన ఆర్పీల శిక్షణ

సామర్లకోట: రామచంద్రపురం మున్సిపాలిటీలో మెప్మా రిసోర్స్ పర్సన్ల శిక్షణ మంగళవారంతో ముగిసింది. సోమవారం నుంచి ఆర్పీలకు రెండు రోజుల శిక్షణ జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ నిర్వహించారు. దీనికి 36 మంది ఆర్పీలు హాజరయ్యారు. బుధవారం నుంచి కాకినాడ కార్పొరేషన్‌లోని ఆర్పీలకు శిక్షణ ఉంటుందని డీఆర్పీ రాజశేఖర్ తెలిపారు.

టీడీపీ నిరసన

సామర్లకోట: వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దని స్థానిక మఠం సెంటర్‌లోని టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు అడబాల కుమారస్వామి, కంటే బాబు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

గోకవరం: రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఒక ఎక్స్కావేటర్, మూడు టిప్పర్లను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు నాగమ్మకు చెందిన సర్వే నెంబర్ 389/16లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతుందని తమకు సమాచారం అందిందన్నారు. ఈ సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి, తవ్వకాలు నిర్వహిస్తున్న ఒక ఎక్స్కావేటర్, రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. ఆ ప్రాంతంలో 4,827 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు నిర్వహించినట్టు అంచనా వేశామన్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుమ్మళ్లదొడ్డికి చెందిన మిర్తిపాటి వెంకటనాగజ్యోతి స్వరూప్, భూ యజమాని, ఆపరేటర్లు, డ్రైవర్లు తదితరులపై కేసు నమోదు చేయాలని గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వెలవెలబోతున్న పెద్దాపురం- సామర్లకోట ప్రధాన రహదారి



నిర్మానుష్యంగా పెద్దాపురం- జగ్గంపేట రహదారి



ప్రత్తిపాడు- సామర్లకోట రహదారి ఇలా..

ఎండ చుర్రుమంటోంది

- అల్లాడుతున్న జనం
- రోడ్లు నిర్మానుష్యం

పెద్దాపురం: భగభగమంటూ భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు.. ప్రజల నెత్తిన సెగలు పుట్టిస్తున్నాడు.. పెద్దాపురం నియోజకవర్గంలో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి మంగళవారం ప్రజలు అల్లాడిపోయారు. రోహిణీ కార్తె ఆరంభం కావడంతో మూడు రోజుల నుంచి వాతావరణం మారిపోయింది. వడగాడ్పులు తీవ్రమయ్యాయి. మధ్యాహ్నమైతే చాలు చాలా ప్రాంతాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వడగాడ్పులు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. జనం తప్పని పరిస్థితుల్లోనే బయటకు వస్తున్నారు. ఉదయం మబ్బు వాతావరణం చూసి కాస్త ఉపశమనం పొందిన ప్రజలకు 11 గంటలు దాటితే ఎండ తీవ్రత అధికం కావడంతో పడరాని పాట్లు పడ్డారు. మధ్యాహ్నమైతే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పెద్దాపురంలో 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ కాకుండా నమోదవుతున్నాయి. అసలే ఉక్కబోతతో ఇబ్బందులు పడుతుంటే.. పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో తరచూ విద్యుత్ కోతలతో జనం విలవిల్లాడుతున్నారు. వేసవి తాపానికి వాహనదారులైతే కాస్త నీడ కనబడితే ఆగి సేదతీరుతున్నారు. రోడ్ల అభివృద్ధి పేరుతో చెట్లు నరికివేయడంతో పట్టణంలో నిలువ నీడ లేక మండుటెండలోనే పరుగులు తీస్తున్నారు. వ్యాపారుల కష్టాలకు ఇక అవధులు లేవు. ఎండ తీవ్రతతో జనం బయటకు రాకపోవడంతో వ్యాపారాలు లేక ఇబ్బంది పడ్డారు.

వేధింపులపై కేసు

కొత్తపల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మూలపేటకు చెందిన ఆర్.సునీతకు బొబ్బిలికి చెందిన రాజేటి చిన్నారావుతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. గత కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్త చిన్నారావు, అత్త రాములమ్మ, మరిది అశోక్‌కుమార్ మానసికంగా వేధిస్తున్నారని సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు.

రేపు రోటరీ గవర్నర్ పర్యటన

బోట్‌క్లబ్: కాకినాడకు రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ భాస్కర్‌రామ్ 25న రానున్నారని క్లబ్ అధ్యక్షుడు కృష్ణప్రకాష్ తెలిపారు. స్థానికంగా ఓ హోటల్‌లో జరిగిన క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం సాయంత్రం అచ్చంపేటలో రోటరీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తారన్నారు. తర్వాత రోటరీ వృద్ధాశ్రమాన్ని సందర్శించి ఇన్‌మేట్స్‌తో సమావేశమవుతారన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్‌ను సందర్శన అనంతర రోటరీ హాల్‌లో నిర్వహించే క్లబ్ ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారన్నారు.

సీఎం జగన్‌తో ప్రతి ఇంటికీ సంక్షేమం



పెద్దాపురంలో పథకాల గురించి వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు దరిచేరాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గురువారం స్థానిక 12వ సచివాలయం పరిధి 23వ వార్డులో గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ, సచివాలయ సిబ్బందితో కలసి ఆయన ఇంటింటికీ తిరిగారు. పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మహిళల అభివృద్ధి, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, పప్పల దుర్గారావు, ఆకుల కృష్ణ బాపూజీ, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ముంపు సమస్య నివారణకు ప్రణాళిక



సమీక్షలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో వర్షాకాలానికి ముందు ముంపు నివారణ కార్యాచరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తూర్పు ఏలూరు, పేట కాలువ, గాడేరు పొడవునా కాలువల సర్వేను నీటిపారుదల శాఖ నిర్వహించి, సిల్ట్ తొలగింపు కోసం కమిషనర్ మహేష్‌కుమార్‌కు సమర్పించారు. దీనిపై త్వరలో అంచనాలు సమర్పిస్తామన్నారు. ఈ నెల 29వ తేదీ లోపు ఆయా ప్రాంతాల్లో ముంపు సమస్య నివారణకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలంలో ముంపు బెడద రాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని అన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: పేదల సంక్షేమం, అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని 19, 20 వార్డులో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులకు వివరించారు. వార్డులో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి సీఎం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలే స్వయంగా చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రజలం కోసం పథకాలను అమలు చేస్తూ, వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

చెరువులో తగ్గిన నీటిమట్టం

- ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన కమిషనర్, కౌన్సిలర్లు
- చేపల వేటకు బ్రేక్



సామర్లకోట: ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువులోకి గోదావరి కాలువ నీటిని నింపి దానిని శుభ్రం చేసి సామర్లకోట పట్టణ ప్రజలకు అందిస్తున్నారు. కాలువ నుంచి నీటి విడుదల నిలిపేయడంతో చెరువులో నీటిమట్టం తగ్గింది. దీనివల్ల ఫిల్టర్ బెడ్ నుంచి ప్రజలకు అందజేస్తున్న తాగునీరు ఆకు పచ్చరంగులో వస్తుంది. ఈ సమయంలో పబ్లిక్‌హెల్త్ అధికారుల అనుమతితో మత్స్యకారులు చేపల వేటకు సిద్ధమయ్యారు. నాలుగు రోజులుగా మున్సిపాలిటీ కుళాయిల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు ఆకుపచ్చ రంగులో వస్తుందని కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు, కమిషనర్‌కు చూపించారు. నాగార్జున ఫిల్టర్ చెరువులో నీటిమట్టం తక్కువగా ఉండటంతో ఫిల్టర్ కావడం లేదని భావించారు. దాంతో కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌తో పాటు కౌన్సిలర్లు ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం పరిశీలించారు. ఆ సమయంలో మత్స్యకార సంఘ నాయకులు చేపల వేటకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన అనుమతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. చెరువులో నీరు తక్కువగా ఉన్న తరుణంలో చేపల వేట సాగిస్తే మరింత ప్రమాదంగా మారుతుందని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రజలకు సరఫరా అయ్యే నీరు స్వచ్ఛంగా వచ్చే వరకూ చేపల వేటకు అనుమతి ఇవ్వవద్దని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ చేపల వేటకు 2025 జూన్ 30 వరకు అనుమతి ఇచ్చారని పట్టణ మత్స్యకార సంఘ అధ్యక్షుడు పెమ్మాడి వీరభద్రవర్మ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫిల్టర్ చెరువులోకి దింపిన పడవలను బయటకు తీసివేయాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

ఆకుపచ్చ రంగులో నీరు



నాలుగు రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి తాగునీరు ఆకుపచ్చ రంగులో వస్తుంది. ఫిల్టర్ చెరువులో నీటిమట్టం తగ్గిపోవడంతో నీరు ఆకుపచ్చ రంగులో ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని చేపల వేటకు అనుమతి ఇవ్వడం మంచిది కాదు. చేపల వేట జరిగితే జలాలు మరింత కలుషితం అవుతాయి.

– స్వయంభారపు వీరభద్రరావు, 14వ వార్డు కౌన్సిలర్

పడవలు తీసేయాలని ఆదేశించాం



నాగార్జున ఫిల్టర్ చెరువులోకి దింపిన పడవలను బయటకు తీసివేయాలని ఆదేశాలు ఇచ్చాం. మంగళవారం మధ్యాహ్నం వరకూ చేపల వేట విషయం నా దృష్టికి తీసుకురాలేదు. ఫిల్టర్ బెడ్ వద్ద జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ మత్స్యకారులు చూపారు. చెరువులో నీటిమట్టం తగ్గిపోవడంతో చేపల వేట సాగిస్తే నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది. కౌన్సిల్ అభిప్రాయమే తుది నిర్ణయం.

– సీఎంఏ నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

విద్యార్థినికి అభినందనలు



జ్యోత్స్నను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థిని దడాల జ్యోత్స్న 589 మార్కులతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ కారే సుధ అన్నారు. రమణక్కపేటకు చెందిన జ్యోత్స్న ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులను సాధించి రాష్ట్రంలోనే ప్రథమ నిలవడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమెను పూలమాలలు, శాలువాతో సత్కరించి రూ.5వేలను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చారు. కార్పొరేటివ్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ సిటీ: పేదల సౌకర్యార్థం జర్నలిస్టులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్‌తో మరణించిన జర్నలిస్టులను గుర్తించుకుని జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టులందరికీ ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కలెక్టరేట్‌కు వచ్చే కక్షిదారులు, ఫిర్యాదుదారులకు పోలీస్ డిపార్టుమెంట్‌కు చెందిన పెంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోటకూర శ్రీనివాసరావు, నక్కా రవి, జర్నలిస్టులు సలీమ్, ప్రకాష్, చిష్టి, అసోసియేషన్ అధ్యక్షుడు మంగం వెంకట శివరామకృష్ణ తదితరులు మజ్జిగను అందజేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కారే సుధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కారే సుధ

కొత్తపల్లి: వేసవిలో తాగునీరు ఎద్దడి లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రధాన పైపు లైన్లు మరమ్మతులకు గురైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీపీ కారే సుధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరు అయిన వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా విధానంలో వినూత్న మార్పులు తీసుకురావడంతోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన కుక్కల నిర్మూలనకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, జగనన్న కాలనీలకు శ్మశాన వాటిక స్థలాలను కేటాయించాలన్నారు. ఇటీవల జరిగిన రీసర్వేలో తప్పుగా నమోదైన భూములపై సవరణ చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో ఉన్న ప్రధాన పైపు లైన్లు మరమ్మతులు చేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము, కుక్కకాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. జెడ్పీ నిధుల వివరాలు తెలపాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేలా స్థానిక సర్పంచులు ఎంపీటీసీలు కృషి చేయాలన్నారు. అమీనాబాదు సర్పంచి నక్కా మణికంఠ, ఉప్పాడ ఎంపీటీసీ చొక్కా సింగన్న మాట్లాడుతూ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే వేట నిషేధ భృతి నమోదులో అధికారులు అలసత్వం వహించడంతో అర్హులైన మత్స్యకారులు అన్యాయం జరుగుతోందన్నారు. కొమరగిరి సర్పంచి సత్యశ్రీ మాట్లాడుతూ కొమరగిరి-పిఠాపురం రోడ్డు చాలా అధ్వానంగా ఉండడం వలన ప్రయాణికులు ఇబ్బందుకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా కొమరగిరి – గోర్స రోడ్డులో వెంకటరాయపురం సమీపంలో ఉన్న మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గ్రామంలో యానిమేటర్ బదులు గోర్స యానిమేటర్‌కు బాధ్యతలు అప్పగించడం తగదన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల విషయంలో ఎటువంటి ప్రొటోకాల్ పాటించడంలేదని తెలిపారు. మహిళా సంఘాల సభ్యుల వద్ద లోను సమయంలో యానిమేటర్లు పర్సంటేజ్ తీసుకుంటున్నారని ఇన్‌చార్జి ఏపీఎం ప్రియదర్శిని సఖీనా దృష్టికి తీసువచ్చారు. ఏ సభ్యురాలు లోన్ సమయంలో ఒక రూపాయి కూడా చెల్లించనవసరం లేదన్నారు. ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నిర్వహించే సమావేశాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, ఎంపీడీఓ అబ్రహం లింకన్, విద్యాశాఖాధికారి వేణుగోపాల్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలి



పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో సంగీతం నేర్పిస్తున్న డాక్టర్ చక్రవర్తి

పెద్దాపురం: ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యసాధన కోసం ప్రణాళికగా ముందుకు సాగాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పట్టణ చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్ కన్వీనర్ రొంగల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో బుద్దా శ్రీనివాస్, కరాటే టీచర్ దుంగల పూజిత, సూర్యశ్రీ, కూనిరెడ్డి అరుణ, రవికుమార్ పాల్గొన్నారు.

- సంగీత సాధనతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని పిఠాపురం వైద్యుడు చక్రవర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు సంగీతాన్ని నేర్పించారు. అనంతరం సుమారు 30 మంది పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

నైతిక విలువలు అవసరం

బాలాజీచెరువు: ప్రతి విద్యార్థికి నైతిక విలువలు అవసరమని ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు, విజయనగరం జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు అన్నారు. వేసవి వినోదంలో భాగంగా మంగళవారం ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒత్తిడి లేకుండా చదవాలని, ముఖ్యంగా క్రమశిక్షణ, మానవత విలువలు కలిగి ఉండాలన్నారు. ఫౌండేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, జిల్లా కార్యదర్శి కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.